క్లుప్తంగా

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు చింతమానులపల్లె గ్రామాల్లో మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. సచివాలయాల్లో రైతులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయా గ్రామాల్లో పంట పొలాలను ఏఓ రైతులతో కలిసి పరిశీలించారు. సంరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ తదితర ప్రయోజనాలను ఏఓ రైతులకు వివరించారు. బిందు సేద్యం రైతులకు అవసరమైన లింక్ పైపులను సబ్సిడీపై అందజేయడం జరుగుతుందని, అవసరమైన రైతులు వివరాలను గ్రామ రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

కోడుమూరు రూరల్ : గూడూరు నగర పంచాయతీ పరిధిలో హోటల్ వ్యాపారస్తులు, దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవని కమిషనర్ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం గూడూరులోని హోటళ్లు, కిరాణ షాపులపై నగర పంచాయతీ సిబ్బంది దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 120ప్లస్ మైక్రాన్స్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని ఆయా దుకాణదారులకు కమిషనర్ పెనాల్టీ విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణం దెబ్బ తింటోందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని సూచించారు.

24లోపు పంట నమోదు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 24వతేదీలోగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఏఓ స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి పంటను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని, రైతు ఏ పంట నమోదు చేసి ఉంటే ఆ పంటనే నమోదు చేయాలని సూచించారు. అలాగే సిబ్బంది ప్రతి రోజు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలివ్వాలని ఏఓ సిబ్బందిని ఆదేశించారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సామీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అమ్మవారికి వడిబియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



ఆలయం వద్ద భక్తుల రద్దీ

రహదారులు ఇలా.. ప్రయాణం సాగేదెలా ?

- రోడ్లను కప్పేసిన ముళ్ల పొదలు
- మలుపుల వద్ద మరీ అధ్వానం
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సి.బెళగల్ నుంచి చింతమానుపల్లె వెళ్లే దారిలో పెరిగిన ముళ్ల పొదలు



ప్రమాదకర మలుపు దగ్గర కనిపించని దారి

సి.బెళగల్: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు గుంతలమయం య్యాయి. ప్రత్యేకించి సి.బెళగల్ మండలంలో ముళ్లపొదలు ఏపుగా పెరిగి రహదారులను కప్పేశాయి. దీంతో రాకపోకలకు గ్రామీణులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పొలాలకు ఎద్దులతో వెళ్లేప్పుడు, దిగుబడులు తీసుకొచ్చేప్పుడే చాలా ఇబ్బందులు పడుతున్నారు. రహదారి కనిపించనంతగా ముళ్ల పొదలు ప్రయాణం సక్రమంగా సాగడం లేదు. ఆర్అండ్‌బీ, పంచాయితీ రాజ్ అని తేడా లేకుండా అన్నీ రోడ్లలోను కంప చెట్లు కప్పేశాయి. మండల కేంద్రం సి.బెళగల్ నుంచి ఏ గ్రామానికి వెళ్లాలన్నా జనం జంకుతున్నారు. మండల కేంద్రం సి.బెళగల్ నుండి చింతమానుపల్లె, పలుకుదొడ్డి, సంగాల, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల రహదారులు మరీ అధ్వానంగా మారాయి. మలుపు ప్రాంతాలలో ఎదురుగా వచ్చే వాహనాలు, వ్యక్తులు కనిపించడ లేదు. పలుకుదొడ్డి దగ్గర సంగాల దారి, బురాన్‌దొడ్డి నుంచి పులకుర్తికి వెళ్లే దారి, సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి, చింతమానుపల్లె దారులలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల ఢీకొన్న సంఘటనలు కోకొల్లలు. మూగజీవాలు అప్పుడప్పుడు గాయాలకు గురువుతున్నాయి. ద్విచక్రవాహన చోదుకులు సైతం కంపచెట్లు తగిలి గాయపడిన సంఘటనలు లేకపోలేదు.

పొలాల రస్తాలను కప్పేసిన ముళ్లకంప చెట్లు

పొలాల రస్తాలను సైతం ముళ్లకంపచెట్లు మూసేశాయి. ఎద్దుల బండ్లతో వెళ్లేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దిగుబడులు తీసుకొచ్చేప్పుడు నరకం చూస్తున్నారు రైతులు. పలుకుదొడ్డిలోని ఒను వంక దారి, క్రిష్ణదొడ్డి పెద్ద చేళ్ల రస్తా, పల్‌దొడ్డిలో బండల రస్తా, కంబదహాల్‌లో అలువాలదారి, బ్యాతోలిలో పెద్దబాట, సి.బెళగల్‌లో బొగ్గల బండ దారి, చింతమానుపల్లెలో ఎత్తిపోతల పథకం దారిని కంపచెట్లు మూసేశాయి. ఎద్దుల బండ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు పడరానిపాట్లు పడుతున్నారు రైతులు. ఎద్దుల బండ్లు పూర్తిగా కంపచెట్లను ఆనుకుని పోవాల్సి వస్తుంది.



పలుకుదొడ్డి - సంగాల గ్రామాల మధ్య ఉన్న మలుపు

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది



పొలాల రస్తాలు ఇబ్బందికరంగా మారాయి. ముళ్ల కంపతో దారులు మూసుకపోయాయి. రోజు పనుల కోసం వెళ్లాంటే కష్టంగా ఉంది. మనుషులు వెళ్లలేని విధంగా ముళ్ల చెట్లు రోడ్లపైకి వచ్చాయి. ఎద్దుల బండితో వెళ్లేప్పుడు మరీ ఇబ్బంది పడుతున్నాం. రైతుల పొలాల రస్తా సమస్యలను ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రైతులు పొలాలకు వెళ్లే దారులను బాగు చేస్తే బాగుంటుంది. – గోవిందు, సి.బెళగల్ రైతు

కనీసం ముళ్ల పొదలను తొలగించాలి



గ్రామీణ రహదారులు ముళ్లపొదలతో నిండిపోయాయి. రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా రోడ్లు మలుపులు ఉన్న చోట ముళ్ల కంపలు చాలా పెరిగాయి. ఎదురుగా వచ్చే వ్యక్తులు, వాహనాలు కనిపించడం లేదు. రోడ్లు మలుపులో కనిపించక చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు. పల్లెలకు వెళ్లే దారులలో ముళ్ల పొదలను తొలగించి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– ప్రేమ్‌కుమార్, ఈర్లదిన్నె గ్రామం

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



ఇప్పటి వరకు ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేశాం. కొన్ని గ్రామాలకు వెళ్లే దారులు, రైతులు పొలాలకు వెళ్లే రస్తాలలో ముళ్ల పొదలు పెరిగిన మాట వాస్తవమే. అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. నిధులు మంజూరు అయితే వెంటనే చెట్ల తొలగింపునకు చర్యలు చేపడుతాం.
– వెంకటప్రకాష్, పీఆర్ ఏఈ, సి.బెళగల్

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల మార్పు

ఓర్వకల్లు: మండల పరిధిలోని సోమయాజులపల్లె నుంచి గని ఏపీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్లకు వెళ్లే 220 కేవీ లైన్ల సామర్థ్యం పెంపు నిమిత్తం వైర్ మార్పు పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు ఉంటుందని డీఈఈ సుబ్బన్న తెలిపారు. ఓర్వకల్లు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ, కాల్వబుగ్గ వ్యవసాయ ఫీడర్ నుంచి వ్యవసాయ బావులకు, బోరుబావులకు, పంచాయతీ నీటి సరఫరా చేసే తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల, గుమ్మితం తండా గ్రామాలకు సంబంధించి విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వ్యవసాయ బోర్లకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుదని, అలాగే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎలాంటి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పులను గమనించాలని సూచించారు.

చంద్ర రాజకుమారికి నివాళి

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమాఖ్య పూర్వపు అధ్యక్షురాలు చంద్ర రాజకుమారి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని సీఆర్ భవన్‌లో నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం చంద్ర రాజకుమారి ఎంతో పోరాటం చేశారన్నారు. ఉమ్మడి ఏపీలో కల్తీ మద్యంపై అనేక పోరాటాలు చేసిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. నగర కార్యదర్శి భారతి, అంజలి, సుధాదేవి, శైలజ, పావని, ఆశాబేగం, కల్లూరు విజయ, నాగేశ్వరమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

వాగు ఆక్రమణపై సర్వే



వాగును సర్వే చేస్తున్న అధికారులు

కర్నూలు(రూరల్): మండలంలోని నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని గార్గేయపురం చెరువు కింద వాగు వెంట భూముల ఆక్రమణలపై మంగళవారం డిస్ట్రిక్ సర్వేల్యాండ్ రికార్డ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునికన్నన్ పర్యవేక్షణలో అధికారులు సర్వే చేశారు. బత్తుల బిల్డర్స్ యాజమాన్యం ఆక్రమణలకు పాల్పడ్డారని ప్రజా సంఘాల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించినట్లు డిస్ట్రిక్ సర్వేల్యాండ్ రికార్డ్ శాఖ. అసిస్టెంటు డైరెక్టర్ మునికన్నన్ తెలిపారు. ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నంబర్ 214, 215, 700, 701, 702లలో సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. పది రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు నివేదికలు సమర్పిస్తామని మునికన్నన్ తెలిపారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వర్కూరు రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్ : రబీ కింద సాగు చేసిన పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న పంటలను రైతులు ప్రతి రోజు పరిశీలిస్తూ తెగుళ్ల సోకకుండా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి వరి, మొక్కజొన్న పంటలపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ తుపాన్ ప్రభావం వలన కురిసే వర్షాలకు పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఏవైనా తెగుళ్లు సోకినట్లైతే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి తగు మోతాదులో రసాయనిక ఎరువులను వాడాలని ఏడీఏ రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సార్.. మా గోడు ఆలకించండి!

- 9వ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వానికి మా గోడు పట్టదా? అని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విధులను బహిష్కరించి నగరపాలక సంస్థ ఎదుట చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో మరింత జాప్యం చేస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జ్ఞానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.20 వేలు జరిమానా



రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు: మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసు తనిఖీల్లో పట్టుబడితే నూతన చట్టం ప్రకారం రూ.20 వేలు జరిమానా విధిస్తామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ట్రాఫిక్ సీఐ ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియో చిత్రాలను ప్రదర్శించి బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు శోకాన్ని మిగల్చొద్దని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రూ.వెయ్యి, మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు, ర్యాష్ డ్రైవింగ్‌కు రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సిందేనన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని, రోడ్డు ప్రమాదాలు ఎక్కడ జరిగినా, ఇబ్బందికరంగా వాహనాలు నడిపినా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్ఎస్ఐ హుసేన్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్‌లో ఆగి ఉన్న విద్యార్థుల ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన ఇద్దరు విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసపత్రిలో వారు పరామర్శించారు.

5న హైందవ శంఖారావ సభ

కోడుమూరు రూరల్ :విజయవాడలో 2025జనవరి 5న జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం కోడుమూరులో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల హైందవ శంఖారావ సమావేశానికి ఆదోని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడలో జరిగే హైందవశంఖారావ సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా హిందూ బంధుమిత్రులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ కర్నూలు ఇన్‌చార్జ్ నీలకంఠ, కార్యకర్తలు కిరణ్, అశోక్, నటరాజు, విటల్, శ్రీలక్ష్మీవెంకటేశ్వర, రామాలయ దేవదస్థాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



రెవెన్యూ సదస్సులో వినతిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. మండల పరిధిలోని పి.రుద్రవరం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఎన్ని అర్జీలు వచ్చాయి... ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారని తహసీల్దార్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతుల నుంచి వినతులు స్వీకరించారు. శ్మశానవాటికకు భూమిని కేటాయించాలని రుద్రవరం గ్రాస్తులు వినతి అందజేయగా ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో అందజేసిన ప్రతి వినతికి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్, వీఆర్వో ఖాజా, సర్వేయర్లు, వీఆర్ఎల్‌లు తదియితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కల్లూరు: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. కల్లూరు అర్బన్ 33వ వార్డులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఇచ్చిన ప్రతి అర్జీని నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 20 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డివిజనల్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ నాగసుధ, తహసీల్దార్ ఆంజనేయులు, సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుపూరులో రెవెన్యూ సదస్సు

పాణ్యం: మండల పరిధిలోని అనుపూరు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ నరేంద్రానథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకించారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు అనుపూరు ప్రజలు వినతి పత్రం అందించారన్నారు. మొత్తం 28 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మమ్మ, ఆర్ఐ రామ్ తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది మంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. నెలన్నరలో ప్రతి వినతికి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వెంకటరమణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై ఎనిమంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. ప్రతి వినతికి పరిష్కారం చూపుతామని చెప్పారు.

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో మంగళవారం ఏడీఏ సాలురెడ్డి, తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 26మంది రైతులు వినతి పత్రాలు అందజేశారు. అర్జీలన్నింటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు అమడగుంట్లలో రెవెన్యూ సదస్సు

కోడుమూరు రూరల్: భూసమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇళ్లను కూల్చాలన్న ఆలోచన విరమించుకోవాలి

కల్లూరు: హంద్రీ నది, వక్కెరవాగే వెంట ఉన్న పేదల గృహాలు కూల్చాలన్న ఆలోచన విరమించుకోవాలని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు కోరారు. ఈ మేరకు మంగళవారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి



ముడుమలగుర్తిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

నేడు ఆధార్ ప్రత్యేక కేంద్రాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలో రేమట, పడిదెంపాడు, ఈ తాండ్రపాడు గ్రామాలలో బుధవారం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త కార్డులతోపాటు మార్పులు, చేర్పులు చేస్తామన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక

కర్నూలు (రూరల్) : కర్నూలు నగరంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో మంగళవారం సాగునీటి పంపిణీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా అవిజ ధర్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వనమక్క ఎంపిక అయ్యారు. వీరికి డివిజన్ రెవెన్యూ అధికారి కిడారి సందీప్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు.

జిల్లాలో 3 వేల టీచర్ పోస్టుల ఖాళీ

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో 3 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయని, డీఎస్సీ నియమాకాలు చేపట్టే వరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, ఐ.మరియానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి వద్ద జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మంత్రిని కోరినట్లు వారు వెల్లడించారు.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న భీమశంకర్ రెడ్డి

గడివేముల: జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కోఆర్డినేటర్ భీమ శంకర రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిని సర్వే చేసి మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించి అవసర మైనవి మంజూరు చేస్తామన్నారు. తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి, రిజిష్టర్లలోనమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏఈ పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు షబానా, రంగడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: గ్రామాలు స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. మంగళవారం స్థానికీకరణ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై (లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలెప్‌మెంట్ గోల్స్ - ఎల్ఎస్‌డీజీఎస్) రెండవ విడత శిక్షణా తరగతులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అధికారులతో కలిసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అయితే కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, 10:48 గంటల అనంతరం ప్రారంభం కావడంతో ముందుగానే వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటప్రకాష్, గోనేనాయక్ తదితరులు పాల్గొన్నారు.